10 వరకు వీధి విక్రయదారుల రిజిస్ట్రేషన్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

నగరపాలక సంస్థ పరిధిలో వీధి విక్రయదారుల నూతన గుర్తింపు కార్డుల దరఖాస్తులు స్వీకరణ ఈనెల 10తో గడువు ముగుస్తుందని కలెక్టర్, ఇన్‌ఛార్జి కమిషనర్ పి.ప్రశాంతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీధి వ్యాపారుల సంక్షేమానికి నగర పాలక సంస్థ కట్టుబడి ఉందన్నారు. ఆరేవిస్ నూతనంగా ఇచ్చే కార్డులో ప్రామాణిక మన్నారు.'సుక నగరంలోని ప్రతి వీధి వ్యాపారి నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని మెప్మా విభాగంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. లేదా ఆయా ప్రాంతాల్లోని వార్డు సంఘాల ఆర్‌పిలను, సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీలను సంప్రదించవచ్చన్నారు. పాస్‌పోర్ట్ సైజు ఫోటో, డిక్లరేషన్ పత్రం, నివాసపత్ర ఆధారం, గతంలో స్ట్రీట్ వెండర్ గుర్తింపు కార్డు నకలు, నగరపాలక సంస్థ జారీ చేసిన గుర్తింపు కార్డు నకలు, ఆధార్ కార్డు, అర్జీదారుని ఫోన్ నెంబర్, బ్యాంకు ఖాతా నకలు తదితర గుర్తింపు పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

బురద రోడ్డుతో ప్రయాణికుల పాట్లు

కల్వర్టు పనులతో ట్రాఫిక్ మళ్లింపు
మట్టిరోడ్డులో దిగబడుతున్న వాహనాలు

ప్రజాశక్తి - పెరవలి

మండలం కానూరు గ్రామంలో బురదమయంగా మారిన రోడ్డుతో ప్రయాణికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ బురదరోడ్డులో వాహనాలు దిగబడిపోవడంతో గంటల పాటు ట్రాఫిక్ స్తంభిస్తోంది. వర్షాకాలం కావడంతో పరిస్థితి మరింత దారుణంగా మారిందని ప్రయాణికులు వాపోతున్నారు. నిడదవోలు- నరసాపురం మెయిన్ రోడ్డులో శ్మశానం చెరువు వద్ద కల్వర్టుకు మరమ్మతులు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో 45 రోజులపాటు కల్వర్టును మూసేస్తూ ఆర్ అండ్ బి అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ కల్వర్టు మీదుగా వెళ్లే వాహనాలను నడిపల్లి కోట మీదుగా మళ్లించారు. కానూరు నుంచి నడిపల్లి కోటకు వెళ్లే సుమారు కిలోమీటరు పొడవున రోడ్డు ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఛిద్రంగా మారింది. పూర్తిగా బురదమయంగా మారడంతో వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. భారీ వాహనాలు గుంతల్లో దిగబడటంతో నిత్యం ట్రాఫిక్ స్తంభిస్తుంది. ఈ సమయంలో వర్షం వస్తే పరిస్థితి మరింత దారుణంగా మారుతోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కానూరు, కానూరు అగ్రహారం, ఉసులుమర్రు, మునిపల్లి, పెండ్యాల, నిడదవోలు మండలాల ప్రజలు వైద్యం ఇతర అవసరాల నిమిత్తం రోజూ తణుకు పట్టణానికి వెళ్తుంటారు. వీరందరికి ఇదే ప్రధాన రహదారి. సోమవారం ఈ రోడ్డుపై ప్రయాణిస్తున్న అరటి గెలల లోడు లారీ బురదలో కూరుకుపోయింది. దీంతో నాలుగు గంటల పాటు ట్రాఫిక్ స్తంభించింది. ఆర్‌టిసి బస్సులు సైతం ట్రాఫిక్‌లో చిక్కుకున్నాయి. ప్రభుత్వాలు మారుతున్నా ఈ రోడ్డును ఎవరూ పట్టించుకోవట్లేదని, ఫలితంగానే నేడు ఈ పరిస్థితి దాపురించిందని స్థానికులు విమర్శిస్తున్నారు.

మట్టిలో దిగబడిన లారీ...

నిలిచిపోయిన ట్రాఫిక్‌లో చిక్కుకున్న ఆర్‌టిసి బస్సు

కల్వర్టు పనులు

అధికారులు చర్యలు తీసుకోవాలి

కానూరు - నడిపల్లి కోట రోడ్డుకు ట్రాఫిక్ మళ్లించడంతో అంతంత మాత్రంగా ఉన్న రోడ్డు మరింత శిథిలమైంది. భారీ వర్షాలకు రోడ్డుపై గోతులు ఏర్పడ్డాయి. భారీ వాహనాలు సైతం ఇదే రోడ్డులో వెళ్లడంతో దిగబడిపోతున్నాయి. దీంతో గంటల తరబడి ట్రాఫిక్ స్తంభిస్తుంది. ప్రయాణికులు నానా ఇబ్బందులు పడుతున్నారు సంబంధిత అధికారులు ఇప్పటికైన స్పందించి కనీసం మరమ్మతులైనా చేపట్టాలని డిమాండ్ చేశారు

- కప్పల ఇజ్రాయిల్, బిఎస్‌పి గ్రామ అధ్యక్షులు, నడిపల్లి

దిగబడకుండా చర్యలు తీసుకుంటాం...

కానూరు - నడిపల్లి కోటకు కొత్త రోడ్డు గ్రాంట్ అయ్యింది. ప్రస్తుతం ట్రాఫిక్ మళ్లించడం కారణంగా రోడ్డు బురదగా మారి, వాహనాలు దిగబడుతున్నట్టు మా దృష్టికి వచ్చిది. వాహనాలు దిగబడకుండా వెంటనే మరమ్మతు పనులు చేపడతాం.

- శ్రీనివాస్, ఎఇ, ఆర్అండ్ బి

అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

లోపాలకు తావివ్వకుండా అర్జీల పరిష్కారం

అధికారులకు కలెక్టర్ ప్రశాంతి ఆదేశం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

ఎలాంటి లోపాలకు తావివ్వకుండా పిజిఆర్ఎస్ అర్జీలకు పరిష్కారం చూపాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో ఆమె పాల్గొని మాట్లాడారు. ఐవిఆర్ఎస్ విధానం ద్వారా పిజిఆర్ఎస్ అర్జీదారుల నుంచి నిరంతరం స్పందన తీసుకుంటున్నారన్నారు. వీటిని పద్ధతి పాటించనివి, ప్రవర్తన సరిగా లేనివిగా వర్గీకరించారని తెలిపారు. ప్రవర్తనాపరమైన అంశాలలో.. అధికారులు సరిగా మాట్లాడుతున్నారా, మిమ్మల్ని బెదిరించారా, లంచాలు అడుగుతున్నారా, ఉద్దేశపూర్వకంగా ఇబ్బందులు పెడుతున్నారా వంటి ప్రశ్నలు అర్జీదారులను అడుగుతున్నట్లు చెప్పారు. ముందుగా నోటీస్ ఇవ్వడంలేదు, ఎండార్స్‌మెంట్ ఇవ్వడం లేదు, అర్జీ దారుతో నేరుగా మాట్లాడటం లేదు, అర్జీదారుకు సమస్య పరిష్కరించిన విధానాన్ని తెలపడం లేదన్న ఫీడ్ బ్యాక్ ప్రజల నుంచి వస్తోందన్నారు. అన్ని శాఖలు ఇలాంటి వాటిపై దృష్టి సారించాలని చెప్పారు. ఒకవేళ సమస్యను పరిష్కరించ లేకపోతే దానికి గల కారణాలు, ప్రత్యామ్నాయ పరిష్కార మార్గాలు ఫిర్యాదుదారునికి తెలపాలని సూచించారు. అర్జీ దారులతో గౌరవంగా మసలుకోవాలని, సమస్య పరిష్కారం కోసం తీసుకుంటున్న చర్యలు వారికి వివరించాలని చెప్పారు. జెసి ఎస్.చిన్న రాముడు మాట్లాడుతూ అర్జీదారులతో సహనంగా వ్యవహరించాలన్నారు. ప్రతి శనివారం ప్రధాన కార్యదర్శి సమీక్ష నిర్వహిస్తున్నారని, అందుకే అధికారులంతా ఫిర్యాదుల పరిష్కారంపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ టి.సీతారామమూర్తి, డిఎల్‌డిఒలు ఎ.స్లీవారెడ్డి, పి.వీణాదేవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు పి.భాగ్యలక్ష్మి, ఎంఆర్ఆర్.ప్రేమ్‌కుమార్, అన్ని శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

'తూర్పు'లో మార్గదర్శి బంగారు కుటుంబం తొలి అడుగు

జిల్లాలో మార్గదర్శి బంగారు కుటుంబం తొలి అడుగు పడిందని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పిజిఆర్ఎస్‌కు బంగారుకుటుంబం లబ్ధిదారుడు పోసిబాబు కుమారుడు మోహన్ కలెక్టర్‌ను కలిశారు. రవళి స్పిన్నింగ్ మిల్లులో నియామకం పొందిన పోస్టు వివరాలు తెలియ జేశాడు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేదరికం లేని సమాజం కోసం మార్గదర్శి బంగారు కుటుంబం కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. అందులో భాగంగా 10 శాతం ఆయా ప్రాంతాల్లో మెరుగైన ఆర్థిక స్థితిలో ఉన్న వ్యక్తులు, వివిధ పారిశ్రామిక సంస్థలు తోడ్పాటుతో నిరుపేదలుగా ఉన్న 20 శాతం మందిని ఉన్నత స్థాయికి తీసుకెళ్తారన్నారు. ఆ మేరకు రవళి స్పిన్నింగ్ మిల్లు యాజమాన్యం జీవనోపాధి కల్పన కోసం ముందుకు వచ్చిందన్నారు. ఎస్.పోసిబాబు కుటుంబానికి మార్గదర్శిగా నిలిచేందుకు ముందుకు వచ్చిందన్నారు. ఇందులో భాగంగా పోసిబాబు కుమారుడు మోహన్‌కి ఉద్యోగం ఇచ్చిందన్నారు. అందొచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాని కలెక్టర్ సూచించారు.

జిల్లాలో ఎరువుల కొరత లేదు : జెడి మాధవరావు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

జిల్లాల్లో ప్రస్తుతం ఎటువంటి ఎరువుల కొరత లేదని జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో గత ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకూ 35,869 టన్నుల వేర్వేరు రకాల ఎరువులను ప్రయివేటు డీలర్లు, మార్క్ ఫెడ్ ద్వారా రైతులకు అందుబాటులో ఉంచామని తెలిపారు. ఇందులో యూరియా 15,294 టన్నులు, డిఎపి 2,615 టన్నులు, పొటాష్ 2,918 టన్నులు, సూపర్ 6,324 టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 8,716 టన్నులు ఉన్నాయన్నారు. ప్రస్తుతం జిల్లాలో 29,479 టన్నుల వివిధ రకాల ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ ఖరీఫ్ సీజన్లో జిల్లాలో సుమారు 83 వేల ఎకరాల్లో సాగు చేస్తుండగా ఇప్పటి వరకు 27,950 ఎకరాల్లో వివిధ రకాల పంటలను సాగు చేస్తున్నారన్నారు. ఎరువులను అధిక సంఖ్యలో ముందస్తుగా కొనుగోలు చేయకుండా అవసరం మేరకే కొనుగోలు చేయాలని, జిల్లాలో అన్ని రకాల ఎరువులు సంవృద్ధిగా ఉన్నాయన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు.

సమస్యలు పరిష్కరించాలని జెసికి వినతి

ప్రజాశక్తి-గోకవరం

సమస్యలను పరిష్కరించాలని వెదురుపాక గ్రామస్తులు జెసి చిన్నరాముడుకు సోమవారం వినతిపత్రం అదించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో జగనన్న కాలనీలో మూడేళ్ల క్రితం సుమారు 500 కుటుంబాల వారు ఇళ్లు కట్టుకుని నివాసం ఉంటున్నామన్నారు. పోలవరం ప్రాజెక్టు కాలవదారివైపు వెళ్లాలంటే సుమారు కిలోమీటర్ వెళ్లాల్సి ఉంటుందని అదే పోలవరం రహదారికి సేకరించిన భూమిలో నుంచి ప్రధాన రహదారికి రావడానికి అనువైన ప్రదేశం అని తెలిపారు. అలా వెళుతున్న తమను పూర్వపు యజమానులు అడ్డ గిస్తున్నారని తెలిపారు. స్పందించిన ఆయన గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్‌తో మాట్లాడారు. కాలనీని సందర్శించి రవాణా సౌకర్యానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సర్పంచ్ దాసరి సింగారమ్మ, ఎంపిటిసి సభ్యులు రామకృష్ణ మాట్లాడుతూ పంచాయతీ నిధులు ఖర్చు చేసి అటుగా గ్రావెల్ రోడ్డు కూడా వేశామన్నారు. పంచాయతీ తీర్మానం మేరకు నిబంధనల ప్రకారంగానే పనులు చేపట్టామన్నారు. అధికారులు కల్పించుకుని శాశ్వత రహదారి ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని వారు కోరారు.

నన్ను రక్షించుకోవాల్సింది మీరే...

ప్రజాశక్తి-కడియం

1927లో ఇక్కడ పుట్టి మీ పూర్వీకుల కాలం నుంచి నేటి వరకు ఎందరికో విద్యాదానం చేసిన మండలంలోని మురమండ గ్రామంలోని దళితపేటలోని నెంబర్-2 ప్రాథమిక పాఠశాలను నేను. మరో రెండేళ్లు గడిస్తే నాకు నూరేళ్లు నిండేవి, కానీ నా దురదష్టమో ఏమో ఈ సంవత్సరమే నాకు నూరేళ్లు నిండి మీకు వీడ్కోలు చెప్పాల్సి వస్తుందని భయంగాను... దిగులుగాను ఉంది. ఎందరో నా ఒడిలో చేరి చదువుకొని వృద్ధిలోకి వచ్చారు. కానీ ఇప్పుడు మీకు నేను అక్కర లేకపోయాను. రకరకాల కారణాలతో మీరు నా మెట్లు ఎక్కడం మానేశారు. మీ పిల్లల్ని నాకు ఇవ్వడం మానేశారు. ఇప్పుడు నా వద్ద ఒకే ఒక పిల్లాడు ఉన్నాడు. పది మంది పిల్లలు కూడా లేని స్కూలు ఎందుకు? మూసివేద్దామని ప్రభుత్వం భావిస్తోంది. మీరు ఆడి పాడిన స్కూలు తలుపులు శాశ్వతంగా మూతపడితే మీకు దిగులు కాదా? నేను శిథిలమై పోతుంటే మీరు చూడగలరా? ఒక్కసారి నా గురించి ఆలోచించండి. మీరంతా.నన్ను నిలబెట్టడానికి ఒకే ఒక మార్గం ఉంది... మీ పిల్లల్ని నా ఒడిలో చేర్చండి... ఒకటి రెండు తరగతులు నా దగ్గరే చదివిస్తామని మీరంతా గట్టిగా అనుకుంటే చాలు. నేను ఎప్పటికీ మీతోనే ఉంటా... మీ పిల్లల చదువుకు నేను గ్యారంటీ.. మా టీచర్ కూడా పాఠాలు చాలా బాగా చెబుతారు. స్కూలు తెరిచి పది రోజులైంది మీ పిల్లలు ఎక్కడున్నా తీసుకువచ్చి నాకు అప్పగించండి. వారిని తీర్చిదిద్ది మీకు అప్పగిస్తా... దీనికి పూర్తి బాధ్యత నాదే... నా రక్షణ... నా భవిష్యత్తు అంతా మీ చేతుల్లోనే ఉంది... మీరు వస్తారని, నన్ను రక్షిస్తారని కళ్లతో ఎదురు చూస్తూ..!

...మీ సర్కారు బడి, మురముండ

సార్వత్రిక సమ్మెకు సన్నద్ధం

ఈ నెల 9న కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగే సార్వత్రిక సమ్మెకు కార్మికులు సన్నద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ప్రచార జాతాలు, బైకు ర్యాలీలు, సన్నాహక సమావేశాలను నిర్వహిస్తున్నారు.

ర్యాలీలో పాల్గొన్న కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు

రాజమహేంద్రవరంలో బైకు ర్యాలీ

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం

కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 9న చేపట్టే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ రాజమహేంద్రవరం నగరంలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.పవన్, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి కె.రాంబాబు, ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు జె.సూరిబాబు మాట్లాడారు. కార్మిక చట్టాలు రద్దు చేసి తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను ఉపసంరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పని గంటలను పెంచుతూ చేసిన తీర్మానాన్ని తక్షణం ఉపసంహరించుకోవాలన్నారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్త పోరాటాలకు కార్మిక వర్గం సిద్ధంగా ఉందన్నారు. 10 శాతంగా ఉన్న పెట్టుబడిదారుల వద్ద దేశ సంపదలో 57శాతం కేంద్రీకృతమై ఉందన్నారు. మిగిలిన 43 శాతం సంపద మాత్రమే 90 శాతం ప్రజలదన్నారు. ప్రపంచంలో 50వ పేదదేశంగా భారత్ నిలవడానికి కేంద్రంలోని బిజెపి మతోన్మాద, కార్పొరేట్ అనుకూల విధానాలే కారణమన్నారు. పేద, ధనిక అంతరాల్లో భారత్ ప్రపంచంలోనే నెంబర్ వన్ స్థానంలో ఉండగా, ప్రపంచ 5వ ఆర్థికవ్యవస్థగా ఎదిగిందని చెప్పుకోవడానికి మోడీ ఏమాత్రం సిగ్గుపడటం లేదని విమర్శించారు. కార్పొరేట్ శక్తుల ప్రయోజనాల కోసమే నాలుగు లేబర్ కోడ్‌లను మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. ఇవి అమల్లోకి వస్తే కార్మికవర్గం 200 ఏళ్ల వెనుకటి పరిస్థితులకు నెట్టబడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా దేశంలోని 45 కోట్ల మంది కార్మికవర్గం సమ్మె చేయడానికి సిద్ధపడుతుందన్నారు. జిల్లాలో కార్మికులు, ఉద్యోగులు, మేధావులు ప్రజాస్వామిక వాదులందరూ కూడా సమ్మెలో పాల్గొనాలన్నారు. మోడీ కార్పొరేట్ అనుకూల, మతోన్మాద విధానాలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ముందుగా ఎఐటియుసి సీనియర్ నాయకులు నల్లా రామారావు జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఈ ర్యాలీ కంబాలచెరువు నుంచి ప్రారంభమై ఎవి.అప్పారావు రోడ్డు, జెఎన్ రోడ్డు, ఆర్‌టిసి బస్టాండ్, తాడితోట మీదుగా కోటిపల్లి బస్టాండ్ వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎస్ఎస్.మూర్తి, కర్రి రామకష్ణ, పూర్ణిమరాజు, ఎఐటియుసి నాయకులు వి.కొండలరావు, సునీల్, సప్పా రమణ, త్రిమూర్తులు, నాయకులు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరులో ప్రచార జాతా...

కొవ్వూరు : ఈ నెల 9న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలంటూ సోమవారం కొవ్వూరులో ప్రచార జాతాను నిర్వహించారు. ఈ జాతాను సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఎం.సుందర్‌బాబు ప్రారంభించి మాట్లాడారు. కార్మికులను బానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలన్నారు. పది గంటల పని విధానాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల పంటలకు గిట్టుబాటు ధర చట్టం చేయాలని, ఆటో, హమాలి, భవన నిర్మాణం, ట్రాన్స్ పోర్ట్ కార్మికులకు సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేయాలనే తదితర డిమాండ్లతో కేంద్ర కార్మిక సంఘాలు ఈ దేశవ్యాప్త సమ్మెను చేపడుతున్నాయన్నారు. ఈ సమ్మెలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్మికుల ప్రాణ త్యాగాలతో పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కాలరాస్తూ నాలుగు లేబర్ కోడ్స్‌లను తీసుకురావడం దుర్మార్గమన్నారు. కంపెనీల యజమానులకు అనుకూలంగా చట్టాలను మారుస్తూ కార్మికుల శ్రమను దోచుకునేలా చేస్తున్నారనానరు. దీన్ని సహించేది లేదన్నారు. ప్రభుత్వ రంగ ఆస్తులను అదానీ, అంబానీ లాంటి కుబేరులకు కట్టబెట్టాలని చూస్తున్నారని విమర్శించారు. బిజెపి విధానాలకు అనుకూలంగానే కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. ఇవి అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ 9న బంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ ప్రచార జాతలో టి.రాజేష్ కె.కనకారావు, కె.వీరబాబు, రవి, రాంబాబు పాల్గొన్నారు.

ప్రచారజాతాలో మాట్లాడుతున్న సుందర్‌బాబు

నిడదవోలులో మాట్లాడుతున్న రాంబాబు

నిడదవోలులో సన్నాహక సమవేశం

నిడదవోలు : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 9న జరగనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు జువ్వల రాంబాబు కోరారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్స్ అమల్లోకి వస్తే మొత్తం కార్మిక వర్గం నష్టపోతుందన్నారు. పెట్టుబడిదారులకు అనుకూలంగా సంస్కరణలు ప్రారంభం కావడంతో కాంట్రాక్ట్ విధానంలో ఉన్న మున్సిపల్ కార్మికులను 2002లో అవుట్‌సోర్సింగ్ కార్మికులుగా మార్చేశారన్నారు. ఫలితంగా వారు పర్మినెంట్ ఉద్యోగులుగా అవకాశాన్ని కోల్పోయారు. 10 గంటలు పని విధానాన్ని కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. ఇలాంటి వాటికి వ్యతిరేకంగా పోరాడాలంటే సమ్మెలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో తూరుగోపు చిరంజీవి, బి.సాయి, రమణ, కాకి శేఖర్, బి.కొండరమేష్, లక్ష్మీభవాని, రాణి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



ఆటో డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి -కొవ్వూరు

విద్యార్థులను తరలిస్తున్న ఆటో డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని పట్టణ సిఐ పి.విశ్వం సూచించారు. సోమవారం కొవ్వూరు గోష్పాల క్షేత్రంలో ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. కచ్చితంగా ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని సూచించారు. స్కూల్ పిల్లల్ని తరలించే సమయంలో ఆటో డ్రైవర్లు మద్యం తాగి ఉంటే ఉపేక్షించేది లేదన్నారు. కచ్చితంగా ప్రతి ఒక్కరు లైసెన్సులు ఉండాలని, రికార్డులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఆటోలో ప్రయాణిస్తున్న విద్యార్థుల పట్ల డ్రైవర్ ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ వారిని గమనిస్తూ ఉండాలని సూచించారు. పరిమితికి మించి విద్యార్థులను తరలించడం వల్ల ప్రమాదాలకు ఆస్కారం ఉంటుందన్నారు. కచ్చితంగా పరిమితులకు లోబడి విద్యార్థులను తరలించాలని సూచించారు. ఆయన వెంట ఎఎస్ఐ జి.శ్రీనివాసరావు ఉన్నారు.

కౌన్సిలింగ్ ఇస్తున్న సిఐ విశ్వం

'రోటరీ' నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - నిడదవోలు

పట్టణంలో స్థానిక రోటరీ ఆడిటోరియంలో రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఇన్‌స్టలేషన్ ఆఫీసర్‌గా రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ 3020 డాక్టర్ వై.కళ్యాణచక్రవర్తి, మంత్రి కందుల దుర్గేష్, సీనియర్ రోటేరియన్, నిడదవోలు మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ 3020 గుంటుపల్లి శ్రీనివాసరావు హాజరయ్యారు. అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలుకు అధ్యక్షులుగా మీసాల శివరామ హరిప్రసాద్, సెక్రటరీగా దారపురెడ్డి శ్రీరామప్రతాప్, ట్రెజరర్‌గా గుంటిపల్లి సత్యసాయి, వైస్ ప్రెసిడెంట్‌గా కొర్లేపర నగేష్, జాయింట్ సెక్రటరీగా ఉజ్జిన బలరాం, తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు. అతిథులను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - కోరుకొండ

రాజానగరం నియోజకవర్గంలో రూ.13కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు ఎంపీ పురంధేశ్వరి సోమవారం ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలను చేశారు. రూ.3.3 కోట్ల ఉపాధి నిధులతో గాడాల నుంచి తొర్రేడు వరకూ నిర్మించనున్న సిసి రోడ్డుకు ఎంపీ దగ్గుబాటి పురంధరేశ్వరి, రాజానగరం ఎంఎల్‌ఎ బత్తుల బలరామకృష్ణ, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి, యువ నాయకుడు అభిరామ్ శంకుస్థాపన చేశారు. గాడాల నుంచి పాలచర్ల వరకు రూ.1.04 కోట్లతో నిర్మించనున్న సిసి రోడ్డుకు, పాత మునగాల నుంచి కొత్త మునగాల వరకూ రూ.35 లక్షలతో నిర్మించనున్న సిసి రోడ్డుకు, బొల్లెద్దుపాలెం నుంచి కోటికేశవరం వరకూ రూ.1.95 కోట్లతో నిర్మించనున్న సిసి రోడ్డుకు శంకుస్దాపన చేశారు. గాదరాడ నుంచి కణుపూరు వరకూ రూ.3 కోట్లతో నిర్మించిన సిమెంట్ రోడ్డును ప్రారంభించారు. గాదరాడలో రూ.60 లక్షలతో నిర్మించనున్న మల్టిపర్పస్ యాక్టివిటి సెంటర్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు నీరుకొండ వీరన్న చౌదరి, ఎపిఆర్.చౌదరి, అడ్డాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పశువులకు ఉచితంగా వ్యాక్సినేషన్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

సత్య చారిటబుల్ ట్రస్ట్, పశుసంవర్ధక శాఖల సంయుక్తంగా సోమవారం హుకుంపేట పంచాయతీ, రామకష్ణ నగర్, సచివాలయం - 3 వద్ద ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా రేబిస్ వ్యాధి నిరోధక టీకాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు 50 మందికి పైగా వారి పెంపుడు కుక్కలను తీసుకొచ్చి వ్యాక్సినేషన్ వేయించారు. ఈ కార్యక్రమంలో సత్యా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, పశు సంవర్ధక శాఖ సంక్షేమ సభ్యులు తమ్మా రవి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మూగ జీవాల పట్ల ప్రేమతో ఉండాలన్నారు. వాటికి రేబిస్ రాకుండా ఇలాంటి క్యాంపులను నిర్వహించడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ ఎడిషనల్ డైరెక్టర్ జి.రవివర్మ, పశువైద్యులు జె.శ్రీరామ్, ఎవి.ప్రసన్నకుమార్, పి.వెంకట్రావు, టిడిపి హుకుంపేట గ్రామ కమిటీ అధ్యక్షులు దుద్దిపూడి రమేష్, రైతు మిత్ర నాయకులు బి.నానాజీ, రామకష్ణ నగర్ బూత్ ఇన్‌ఛార్జులు ఎలమాటి రామకృష్ణ, ఎ.గోపాలకృష్ణ, ఎఎంసి డైరెక్టర్ ఎం. హిమబిందు, శ్రీదేవి పాల్గొన్నారు

నేరాలు ఘోరాలు

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - నిడదవోలు రూరల్

మండలంలోని తాడిమల్ల శివారు బోనం రామకృష్ణకు చెందిన కొబ్బరి తోటలో గుర్తు తెలియని వ్యక్తి ఉరివేసుకుని అనుమానాస్పదంగా మృతి చెందాడని సమిశ్రగూడెం ఎస్ఐ ఎల్.బాలాజీ సుందర్‌రావు తెలిపారు. సోమవారం ఉదయం తోటలో కూలీలు పనిచేస్తుండగా చెట్టుకు వేలాడుతున్న గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారన్నారు. వెంటనే వారు అధికారులకు సమాచారం ఇచ్చారని తెలిపారు. విఆర్ఒ కె.గంగాజలం ఘటనా ప్రాంతాన్ని పరిశీలించి, పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. ఉరి వేసుకున్న వ్యక్తి వయస్సు 50ఏళ్లు ఉండొచ్చని తెలిపారు. నిక్కర్ ధరించి ఉన్నాడని తెలిపారు. మృతి చెంది వారం రోజులు కావొచ్చున్నారు. విఆర్ఒ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

బియ్యం, వాహనాన్ని సీజ్ చేస్తున్న అధికారులు

రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ముగ్గురు అరెస్ట్

ప్రజాశక్తి -కొవ్వూరు

పట్టణంలో రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ముగ్గురు వ్యక్తలను అరెస్టు చేశామని పౌర సరఫరాల శాఖ డిటి టి.సునీత తెలిపారు. కొవూరు టోల్ గేట్ సమీపంలో మూడు బైకులపై అక్రమంగా తరలిస్తున్న 500 కేజీల పిడిఎస్ బియ్యాన్ని స్వాధీనం స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిత్యవసర సరుకుల నియంత్రణ చట్టం 6ఎ కింద కేసు నమోదు చేశామన్నారు. స్వాధీనం చేసుకున్న మూడు బైకులను పట్టణ పోలీసులకు అప్పగించామన్నారు. రేషన్ బియ్యం కొనుగోలు చేసినా, అమ్మిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రావులపాలెంలో...

అక్రమంగా తరలిస్తున్న మూడు టన్నుల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం గోపాలపురం హైవేపై నిఘా కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వాహన తనిఖీల్లో విజిలెన్స్ అధికారులకు అందిన సమాచారం మేరకు నరసాపురం నుంచి రావులపాలెం వైపు వస్తున్న మినీ వ్యాన్ ను తనిఖీ చేశారు ఈ వ్యాన్‌లో 60 బస్తాలు, మొత్తం 3 టన్నుల బియ్యం ఉండటాన్ని గుర్తించారు. ఈ బియ్యాన్ని సరైన ఆధారాల్లేకుండా అక్రమంగా తరలిస్తున్న కారణంగా అధికారులు వ్యాన్‌ను స్వాధీనం చేసుకుని, డ్రైవర్‌తో పాటు సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసి స్థానిక పోలీస్ స్టేషన్ కి అప్పగించారు. తనిఖీల్లో విజిలెన్స్ సిఐ మధుబాబు, డిసిటిఒ నవీన్ కుమార్, రావులపాలెం ఎంఎస్ఒ పి.వెంకటేశ్వరరావు, వి ఆర్ఒ వి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పేకాట శిబిరాలపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - గొల్లప్రోలు

పట్టణ శివారులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఎనిమిది మంది వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి రూ.22,590 నగదును స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు.

జగ్గంపేటలో..

మండలంలోని మన్యంవారిపాలెం శివారులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఎస్ఐ రఘునాథరావు, సిబ్బంది దాడి చేసి నలుగురిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.5150 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సిఐ వైఅర్‌కె. శ్రీనివాస్ తెలిపారు.

విద్యార్థినులతో లయన్స్ క్లబ్ ప్రతినిధులు

యూనిఫామ్‌ల పంపిణీ

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఉండ్రాజవరం ఉన్నత పాఠశాల ప్లస్, బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థినిలకు తణుకు లయన్స్ క్లబ్ ప్రతినిధి చిట్టూరి సుజాత ఆర్థిక సాయంతో ఒక్కొక్క విద్యార్థినికి 2 జతల యూన్‌ఫామ్‌లను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సుజాతను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు, ప్రధానోపాధ్యాయుడు పి.రామకృష్ణ, అధ్యాం కులు బూరుగుపల్లి పద్మజారాణి, మహేష్‌కుమార్, ఎస్.లక్ష్మీనారాయణ, విద్యార్థినులు పాల్గొన్నారు.

కాకరపర్రులో రంగా విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - పెరవలి

మండలం కాకరపర్రు గ్రామంలో వంగవీటి మోహన్‌రంగ విగ్రహాని మంత్రి కందుల దుర్గేష్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభినవ రాబిన్‌హుడ్ వంగవీటి మోహన రంగా అన్నారు. తన చివరి శ్వాస వరకు పేదల కోసం బతికిన ప్రజా నాయకుడు రంగ అన్నారు. తండ్రిలాగే తనయుడు వంగవీటి రాధ కూడా రాష్ట్ర స్థాయి నాయకునిగా ఎదగాలన్నదే తన ఆకాంక్ష అన్నారు. ఈ కార్యక్రమంలో సంగీతం నాగు, పిప్పర రవికుమార్, ఎంపిటిసి గుడాల రంగారావు, అంజిబాబు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆవిష్కరణ సభలో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

సకాలంలో అర్జీలకు పరిష్కారం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

నిర్దేశించిన సమయంలో చట్టపరిధిలో అర్జీలను పరిష్కరించాలని ఎస్‌పి డి.నరసింహకిషోర్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో ఆయన పాల్గొన్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వారి కష్టాలను, బాధలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. సమస్యపై నేరుగా సంబంధిత స్టేషన్ పోలీసు అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడారు. ఫిర్యాదుదారుల సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించి, సత్వరమే న్యాయం చేయాలని ఆదేశించారు. ఎస్‌పి మాట్లాడుతూ అర్జీలన్నింటినీ పరిశీలించి నాణ్యతతో చట్ట పరిధిలో పరిష్కరిస్తామన్నారు. నేటి పిజిఆర్ఎస్‌లో 35 అర్జీలు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పిలు

అర్జీలు స్వీకరిస్తున్న అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్

ఎన్‌బిఎం.మురళీకృష్ణ, ఎవి.సుబ్బరాజు, ఎల్.అర్జున్, ఎస్‌బి డిఎస్‌పి బి.రామకృష్ణ, సిఐలు శ్రీనివాసరావు, పవన్‌కుమార్‌రెడ్డి ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారం

పిజిఆర్ఎస్‌లో వచ్చే ఫిర్యాదులను అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కరించాలని అడిషనల్ కమిషనర్ పివి.రామలింగేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను సోమవారం నిర్వహించారు. మొత్తం 20 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి అర్జీని నాణ్యతతో సకాలంలో పరిష్కరించాలన్నారు. అర్జీ పునరావతం కాకుండా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, సెక్రటరీ జి.శైలజావల్లి, ఎస్ఇ ఎంసిహెచ్.కోటేశ్వరరావు, మేనేజర్ ఎమ్‌డి అబ్దుల్ మాలిక్, ఎంహెచ్ఒ వినూత్న, తదితరులు పాల్గొన్నారు. మున్సిపల్ ఇంజినీరింగ్ ఒప్పంద కార్మికుల వేతనాలు పెంచాలని, సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని మునిసిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు అర్జీ అందించారు.

కొవ్వూరు : పిజిఆర్ఎస్‌కు డివిజన్ స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరవ్వాలని, అర్జీదారుల సమస్యలకు అవకాశం మేరకు సత్వరమే పరిష్కరించాలని ఆర్‌డిఒ రాణి సుస్మిత సూచించారు. సోమవారం ఆర్‌డిఒ కార్యాలయంలో నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో ఆమె పాల్గొని 19

కొవ్వూరులో అర్జీలు స్వీకరిస్తున్న ఆర్‌డిఒ రాణి సుస్మిత

అర్జీలను స్వీకరించారు. ఆమె మాట్లాడుతూ వారంలో రెండు రోజులు ఆయా ప్రభుత్వ శాఖలకు సంబంధించి జిల్లా అధికారి, డివిజన్ అధికారులతో సమావేశం నిర్వహించి అర్జీలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కొవ్వూరు మండలం ఐ.పంగిడికి చెందిన పి.దేవప్రసన్న అనే మహిళ భూ సర్వే నెంబర్ 63/161లో 5 ఎకరాల భూమికి సంబంధించి మ్యూటేషన్ నిలుపుదల చేసి పట్టా పాస్‌బుక్ ఇవ్వకుండా ఆపాలని కోరారు. తాళ్లపూడి మండలం మలకపల్లికి చెందిన కాకర్ల ధనసత్యవాణి తనకు నిడదవోలు మండలం కోరుమామిడిలోని భూమికి రీ సర్వే చేసి అప్పగించాలని వినతిపత్రం అందించారు. తన పొలాన్ని అక్రమించుకున్నారని, సర్వే చేసి అప్పగించాలని దేవరపల్లి మండలం గౌరీపట్టణానికి చెందిన కెఆర్.రామసీతాదేవి వినతిపత్రం అందించింది. ఈ కార్యక్రమంలో డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సుపరిపాలనలో తొలి అడుగు

ప్రజాశక్తి - నిడదవోలు

పట్టణంలో 26వ వార్డులో సుపరిపాలనలో తొలి అడుగు ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివద్ధి సంస్థ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు పాల్గొన్నారు. ఇంటింటా పర్యటించి కరపత్రాలు పంచారు. పాలనపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు కొమ్మిన వెంకటేశ్వరావు, సెక్రటరీ తిరుపతి

గోకవరంలో పాల్గొన్న ఎంఎల్ఎ జ్యోతుల

సత్యనారాయణ, క్లస్టర్, యూనిట్, బూత్ కన్వీనర్లు, కో - కన్వీనర్లు, పట్టణ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గోకవరం : గోకవరంలో సోమవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. కూటమి నాయకులు ఇంటింటా పర్యటింటా పర్యటించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై కరపత్రాలు అందజేస్తూ వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జగ్గంపేట ఎంఎల్ఎ జ్యోతులనెహ్రూ పాల్గొని మాట్లాడారు. వైసిపిలా తమది పరదాల పాలన కాదన్నారు. అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లలో ముందుకు తీసుకెళ్లే సత్తా ఒక్క చంద్రబాబుకే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం : రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రజలు ప్రశంసలు కురిపిస్తున్నారని ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు అన్నారు. సోమవారం ఆయన స్వగ్రామం

ఉండ్రాజవరంలో పాల్గొన్న బూరుగుపల్లి శేషారావు

వేలివెన్నులో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అత్తిలి సత్యనారాయణ, ఉప సర్పంచ్ బూరుగుపల్లి శ్రీనివాసరావు, టిడిపి మండల అధ్యక్షులు సింహాద్రి రామకృష్ణ, క్లస్టర్ ఇన్‌ఛార్జి ఇ.సత్యనారాయణ, యూనిట్, బూత్ కన్వీనర్లు, కో-కన్వీనర్లు పాల్గొన్నారు.

ల్యాబ్ సేవలు శూన్యం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ల్యాబ్ భవనం

ఉండ్రాజవరం పిహెచ్‌సిలో ల్యాబ్ సేవలు శూన్యంగా కనిపిస్తున్నాయి. కరోనా సమయంలో వ్యాధి నిర్ధారణ పరీక్షల కోసం బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ భవనాన్ని పిహెచ్‌సికి అనుబంధంగా నియోజకవర్గ మొత్తానికి ఉపయోగపడేలా భవన నిర్మాణాన్ని ప్రారంభించారు. కూటమి ప్రభుత్వంలో నిర్మాణం పూర్తి చేసుకుంది. ఇటీవలే మంత్రి కందుల దుర్గేష్ దీన్ని ప్రారంభించారు. దీన్ని ప్రారంభించి రెండు నెలలు కావొస్తున్నప్పటికీ ల్యాబ్ సేవలను రోగులకు అందుబాటులోకి రాలేదు. పూర్తి స్థాయి ల్యాబ్ టెక్నీషియన్‌ను నియమించకపోవడంతో పరిస్థితి గతంలో మాదిరిగానే ఉంది. వ్యాధి నిర్ధారణ పరీక్షల కోసం ప్రయివేటు ల్యాబులను ఆశ్రయిం చాల్సి వస్తుంది. పెద్ద ల్యాబ్ నిర్మించి టెక్నీషియన్‌ను నియమించకపోవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించాలని, టెక్నీషియన్‌ను నియమించి పూర్తిస్థాయిలో వైద్య పరీక్షలను అందుబాటులోకి తేవాలని పలువురు కోరుతున్నారు.

వృద్ధాశ్రమానికి సరుకులు అందిస్తున్న ఎబిఎన్ అండ్ పిఆర్ఆర్ కళాశాల సిబ్బంది

ఘనంగా వెంకటేశ్వరరావు జయంతి

ప్రజాశక్తి -కొవ్వూరు

అవంతి ఫీడ్స్, ఎబిఎన్ అండ్ పి ఆర్ ఆర్ కళాశాల వ్యవస్థాపకులు అల్లూరి వెంకటేశ్వరరావు జయంతిని సోమవారం కొవ్వూరులో ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ రామ్మోహన్, గౌరవ సలహాదారు ఎన్‌వి.సుబ్బారావు ఇతర అధ్యాపకులు కళాశాలలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంతోమంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు, ఉన్నత చదువులకు తోడ్పడిన వెంకటేశ్వర సేవలను వక్తలు కొనియాడారు. పట్టణంలోనే వాత్సల్య వృద్ధాశ్రమానికి నెల రోజులు సరిపడా నిత్యావసర సరుకులను అందజేశారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ వై.రమేష్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

'కూటమి ప్రభుత్వం రైతుల పక్షపాతి'

ప్రజాశక్తి-గోకవరం

కూటమి ప్రభుత్వం రైతుల పక్షపాతి అని జగ్గంపేట ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ అన్నారు. సబ్సిడీ విత్తనాలు, డ్రోన్లను కొత్తపల్లి, వెదురుపాక గ్రామాల్లో రైతులకు ఆయన సోమవారం అందించారు. ఈ నెలలోనే అన్నదాత సుఖీభవ ద్వారా రైతుల ఖాతాలకు నగదు జమ అవుతుందన్నారు. ఇచ్చిన ప్రతి హామీని చంద్రబాబు నెరవేరుస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.రైటప్: రైతులకు డ్రోన్ లు,విత్తనాలు అందజేస్తున్న ఎమ్మెల్యే నెహ్రూ

సంక్షేమ పథకాలు అందించాలని వినతి

ప్రజాశక్తి - తాళ్లపూడి

తమకు సంక్షేమ పథకాలను అందించాలంటూ అంగన్‌వాడీలు సోమవారం తహశీల్దార్ లక్ష్మీలావణ్యకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తామని ప్రభుత్వం తెలిపిందాన్నరు. కాని ఆ పని చేయలేదన్నారు. కాని ప్రభుత్వ ఉద్యోగుల పేర సంక్షేమ పథకాలను అందించట్లేదన్నారు. కనీసం రేషన్ కార్డులను సైతం ఇవ్వట్లేదన్నారు. దరఖాస్తుల్లో తల్లిదండ్రుల పేర్లు ప్రభుత్వ ఉద్యోగులుగా చూపిస్తున్నాయంటూ అధికారులు పక్కన పెడుతున్నారన్నారు. ఇచ్చే అరకొర వేతనంతో బతుకీడుస్తున్నామన్నారు. తమని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించకపోగా తమ పిల్లలను కూడా సంక్షేమ పథకాలు అందుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యూనియన్ నాయకురాలు జ్యోతి ఆధ్వర్యంలో వారు వినిపత్రం అందించారు.

డ్రాపౌట్స్ లేకుండా చూడాలి

ప్రజాశక్తి - చాగల్లు

డ్రాపౌట్స్ లేకుండా చూడాలని, ఐదేళ్లు నిండిన పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో చేరేలా అవగాహన కల్పించాలని చాగల్లు ఎంఇఒ కెవివి.రామాంజనేయులు ఉపాధ్యాయులకు సూచించారు. స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యంతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలల్లో నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులను వసూలు చేయరాదన్నారు. విద్యార్థులు వారికి నచ్చిన చోట యూనిఫారం కొనుగోలు చేసుకోవచ్చన్నారు ఎటువంటి కారణం లేకుండా విద్యార్థుల ప్రవేశాన్ని నిరాకరించరాదన్నారు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో ఎంఇఒ-2 సుభాకర్, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

ఘనంగా మంద కృష్ణ పుట్టినరోజు

ప్రజాశక్తి-గోకవరం

గోకవరం సంజీవయ్య నగర్‌లో బాబు జగ్జీవన్‌రామ్ కమ్యూనిటీ భవనం ఆవరణంలో ఎంఎస్‌పి మండల అధ్యక్షులు గరబారపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ పుట్టిన రోజును సోమవారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఎంఆర్‌పిఎస్ ఆవిర్భావదినోత్సవం సందర్భంగా జెండాను ఎగరవేసి కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. ఈ కార్యక్రమంలో బి.వీరచంద్రం, సిహెచ్.వెంకన్న, చీకట్ల రాజు, సిహెచ్.చిట్టియ్య తదితరులుపాల్గొన్నారు.

కూలిన వంతెన వద్ద తాత్కాలిక మార్గానికి చర్యలు

ప్రజాశక్తి - ఆలమూరు

మురికి నీటి కాలువపై ఉన్న వంతెన కూలిన స్థానంలో తాత్కా లికంగా ద్విచక్ర వాహనాలపై రైతుల రాకపోకలకు అడ్డంకి లేకుండా ఐరన్ వంతెన ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు డ్రెయిన్స్ డిఇ పోచారావు అన్నారు. పినపళ్ళ నుండి మండపేట వెళ్ళు మురికి నీటి కాలువపై ఉన్న వంతెన కూలడంతో సోమవారం ఆయన డ్రెయిన్స్ జెఇ సుబ్రహ్మణ్యం, చింతలూరు నీటి సంఘం అధ్యక్షుడు గారపాటి శ్రీనివాస్ చౌదరి లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పుడు ఈ కాలువపై నూతన వంతెన నిర్మాణం సాధ్యం కాదన్నారు. భారీ వర్షాల కారణంగా ఇప్పటికే కొంతమేర శిథిలమై ఉన్నా ప్రస్తుత వంతెన భారీ వాహనాల రాకపోకలతో కూలిపోయిందన్నారు. ఈ విషయాన్ని స్థానిక ఎంఎల్ఎ బండారు సత్యానందరావు దృష్టికి తీసుకు వెళ్లినట్లు డిఇ పోచారావు తెలిపారు. ఎంఎల్ఎ స్పందించి రైతులకు ఎటువంటి అడ్డంకి

కృష్ణ ప్రభాస్ పేపర్‌మిల్ యాజమాన్యంతో మాట్లాడుతున్న డిఇ

లేకుండా వారి సాగుకు మార్గాలు ఏర్పాటు చేయాలని సూచించినట్లు తెలిపారు. స్థానికంగా ఉన్న శ్రీకష్ణ ప్రభాస్ పేపర్ మిల్లు యాజమాన్యంలో ఒకరైన వల్లూరి వెంకట్రావును రైతుల రాకపోకులకు అనువుగా మార్గం ఏర్పాటు చేసేందుకు సహకరించాలని కోరినట్లు డిఇ పోచారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో డ్రెయిన్స్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పనుల లోపంపై సెక్రటరీని ఆరా తీస్తున్న కూటమి నాయకులు

మరమ్మతు పనుల్లో లోపించిన పారదర్శకత

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని చెముడులంక ప్రధాన కాలువపై నిర్మించిన వంతెన అప్రోచ్ మరమ్మతులలో పారదర్శకత లోపించినట్లు స్థానిక కూటమి నాయకులు సోమవారం పరిశీలించి ఆరోపించారు. బడుగువానిలంక గ్రామ ప్రజలకు రాకపోకల కోసం నిర్మించిన పెద్ద వంతెన దగ్గర వర్షాలు కారణంగా వంతెన దిగువులో పెద్ద గుంతలు ఏర్పడి మడుగుల తయారైందన్నారు. దీంతో ఎంఎల్ఎ బండారు సత్యానందరావు దృష్టికి బడుగువానిలంక నాయకులు తీసుకుని వెళ్లారు. దీంతో స్పందించిన ఆయన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న ఆయన పరిశీలించారు. స్పందించిన ఆయన వెంటనే చెముడులంక సెక్రటరీనీ పిలిపించి 1,2 రోజుల్లో గుంతల్లో అడుగున గ్రావెల్ వేసి పైన చిప్స్ వేసి మార్గానికి మరమ్మతులు చేయాలని ఆదేశించారు. కానీ పంచాయతీ అధికారులు పర్యవేక్షణ లేకుండా తూతూ మంత్రంగా పనులు ముగించినట్లు కూటమి నాయకులు అన్నారు. గడిచిన 2 నెలలుగా గుంతలు పట్టించుకోలేదని, ఎంఎల్ఎ బండారు సత్యానందరావు దృష్టికి వచ్చిన తర్వాత గుంతలకు చర్యలు వచ్చాయని మాజీ డిసి అధ్యక్షుడు నాగిరెడ్డి వెంకటరత్నం, టిడిపి గ్రామ ప్రెసిడెంట్ కొత్తపల్లి రాంబాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి శ్రీలలిత, ఇంజనీరింగ్ అసిస్టెంట్ విశ్వ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మురుగునీరు తరలింపునకు చర్యలు

ప్రజాశక్తి - ఆలమూరు

స్థానిక సిహెచ్‌సిలో చిన్నపాటి వర్షానికి రోజుల తరబడి నిల్వ ఉంటున్న మురుగునీరును గ్రామ పంచాయతీ డ్రెయినేజీ తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఇన్‌చార్జి డిఎల్‌పిఒ, ఎంపిడిఒ ఎ.రాజు అన్నారు. ఆయన సోమవారం స్థానిక సిహెచ్‌సి యొక్క డ్రెయినేజీ వ్యవస్థను పరిశీలించారు. ఆస్పత్రులో ఎదుర్కొంటున్న ఇబ్బందులను సూపరింటెండెంట్ ఎం.శివశంకర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ పి.పద్మ, సర్పంచ్ నేలపూడి లావణ్య, కార్యదర్శి కృష్ణ, మాజీ జెడ్పిటిసి రామానుజుల శేషగిరిరావుతో పరిశీలనలో ఉన్నారు. ప్రస్తుతం ఆస్పత్రిలో మురుగునీరు తరలించేందుకు తాత్కాలిక ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు. అయితే ఈ డ్రైనేజీ వ్యవస్థను అండర్ గ్రౌండ్ వ్యవస్థగా మార్చేందుకు శాశ్వత నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇతో ఆయన అన్నారు. అలాగే సంబంధిత డ్రైన్ కోసం ఎస్టిమేట్ తయారు చేయాలని ఆయన సూచించారు. దీంతో ఆస్పత్రిలో వచ్చే వ్యర్థాలను చెత్తకుండీలలో మాత్రమే వేసి నిండిన వెంటనే ఒకేసారి తరలించేందుకు ఏర్పాట్లు వేగవంతం చేయాలని ఎంపిడిఒ ఆదేశించారు.

మండపేటలో కిసాన్ డ్రోన్‌ల పంపిణీ

ప్రజాశక్తి - మండపేట

వ్యవసాయ యాంత్రీకరణ పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రైతులకు 80 శాతం రాయితీతో అందిస్తున్న కిసాన్ డ్రోన్స్‌ను సోమవారం రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు రైతులకు పంపిణీ చేశారు. మండపేట మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఎంఎల్ఎ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయంలో పెట్టుబడిని తగ్గించడానికి రైతులు సమిష్టిగా డ్రోన్‌లను ఉపయోగించాలన్నారు. కిసాన్ డ్రోన్లు ఉపయోగించటం ద్వారా రైతులు సమయం, ఖర్చు ఆదా చేయవచ్చు అన్నారు. పెద్ద పొలాలకు డ్రోన్ల వాడకం ఉపయోగకరంగా ఉంటుందని, తక్కువ సమయంలో ఎక్కువ భూమిని ఈ డ్రోన్లు పిచికారీ చెయ్యగలవన్నారు. ఈ కార్యక్రమంలో మండపేట మున్సిపల్ ఛైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, ఎనిమిదో వార్డ్ కౌన్సిలర్ మందపల్లి రవికుమార్, మండపేట మార్కెట్ కమిటీ ఛైర్మన్ చింతపల్లి రామకష్ణ, పెనుమత్స వెంకటవర్మ రాజు, అగ్రికల్చర్ ఎ.ఒ ప్రభాకర్, ఇన్ ఛార్జ్ ఎ.డి రమేష్ కుమార్, తదితర్లు పాల్గొన్నారు.

కోనసీమ అభివృద్ధిలో కళా వెంకట్రావు కృషి మరువలేనిది

ప్రజాశక్తి - రావులపాలెం

కోనసీమ అభివృద్ధిలో మాజీ ఎంఎల్ఎ కళా వెంట్రావు కృషి మరువలేనిదని జిల్లా వైసిపి అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. సోమవారం ఉమ్మడి మద్రాస్ రాష్ట్ర మాజీ రెవెన్యూ శాఖ మంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు, కొత్తపేట నియోజకవర్గ తొలి ఎంఎల్ఎ కళా వెంకట్రావు 125వ జయంతికి ముఖ్యఅతిథులగా చిర్ల జగ్గిరెడ్డి,కళావెంట్రావు మనవళ్లు, మునిమనవళ్లు కుటుంబ సభ్యులు, ప్రజాప్రతినిధులు, పలువురు ప్రముఖులు హాజరయ్యారు. కళా వెంకట్రావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమం రావులపాలెం జడ్‌పిటిసి సభ్యుడు కుడిపూడి శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి, సీనియర్ లాయర్ వేణు, సఖినేటివాకుల రాజు వెలగల సత్తిరెడ్డి కొట్టు సత్యనారాయణ బొక్క శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమల్లో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి - సఖినేటిపల్లి

ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమ పథకాలు అమలు చేయడంలో విఫలమైందని వైసిపి జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. సోమవారం సఖినేటిపల్లి మండలంలో జరిగిన బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ పేరుతో జరిగిన నియోజకవర్గ సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. . కూటమి ప్రభుత్వమే ఏర్పడి ఏడాదికి ప్రజలకు ఈ ప్రభుత్వంపై అవిశ్వాసం పెరిగింది అన్నారు. అమలాపురం పార్లమెంట్ పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి కూటమి ప్రభుత్వంలో ప్రజలపై దాడులు జరుగుతున్నాయని అన్నారు. ప్రభుత్వం చేస్తున్న కక్ష సాధింపు చర్యలు తగదని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్చార్జ్ గొల్లపల్లి సూర్యారావు, సఖినేటిపల్లి మండల అధ్యక్షులు కుసుమ చంద్రశేఖర్, రాజోలు, మలికిపురం జడ్‌పిటిసి సభ్యులు మట్టా శైలజ, బల్ల ప్రసన్న కుమారి, మండల, గ్రామ కమిటీల నాయకులు పాల్గొన్నారు.

సత్యనారాయణ ఎంపిక అభినందనీయం

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

వైసిపి నూతన మండల కమిటీ అధ్యక్షుడిగా తొలిసారిగా ఎస్‌సి సామాజిక వర్గానికి చెందిన గూటం సత్యనారాయణ ను ఎంపిక చేయడం అభినందనీయమని జెడ్‌పిటిసి సభ్యుడు పుట్టపూడి వీర వెంకట సూర్యనారాయణ అన్నారు. సోమవారం, అంగర వైసిసి కార్యాలయం వద్ద మండల కమిటీ అభినందన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం సత్యనారాయణ ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు అడ్డాల శ్రీనివాస్, మేడిశెట్టి దుర్గారావు, పలివెల మధు, వాసంశెట్టి విష్ణు, వంగా నల్లశ్రీను, ఎం దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

కాకినాడ జిల్లా, కాకినాడ అర్బన్, డైరీఫాం సెంటర్, సాంబమూర్తి నగర్, ఇందిరా కాలనీ, డోర్ నెం. 16-42-62 కాపురస్తులు కూండ్రపు అప్పన్న గారి కుమారుడు కూండ్రపు జానకి అచ్చుత శివ సత్యన్నారాయణ గారు యావన్మందికి తెలియజేయునది ఏమనగా,

నా యొక్క పాస్‌పోర్టు నెం. **B5397309,** తేది. 16-05-2001 కలది నేను 30-6-2025వ తేదీన జిరాక్స్ నిమిత్తం మా ఇంటి నుండి భానుగుడి జంక్షన్‌లో గల జిరాక్స్ షాపునకు నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్టు తీసుకుని మోటార్ సైకిల్‌పై వెళ్ళుచుండగా నా యొక్క పాస్‌పోర్టు పడిపోయినది. వెనుకకు వచ్చి ఎంత వెతికిన దొరకలేదు. కావున ఈ పాస్‌పోర్టు దొరికిన ఎడల ఈక్రింది అడ్రసుకు తెలియజేయగలరు.

కూండ్రపు జానకి అచ్చుత శివ సత్యన్నారాయణ
డోర్ నెం. 16-42-62, సాంబమూర్తి నగర్
ఇందిరా కాలనీ, కాకినాడ అర్బన్
సెల్: 9989102425

మహారాజశ్రీ రామచంద్రపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.P. No. 88/2019 in O.S. No. 633/2012

Between:
పడమటి సత్యనారాయణ చౌదరి ...DHr
AND
గున్నం వెంకట మోహన్, S/o. ఆదినారాయణ మూర్తి, హిందూ, 46 సం॥లు, డో.నెం. 79-13-14, శ్యామల నగర్; రాజమహేంద్రవరం, తూ॥గో॥జిల్లా. ...JDr

పై నెంబరు E.P. లో JDr అయిన మీకు పై కోర్టు వారి ద్వారా పోస్టులు ద్వారా ఎన్నిసార్లు సేల్ నోటీసులు పంపించినను తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నారు. కావున **ది. 21-7-2025వ తేదీన** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, అడ్వకేటు గారి ద్వారా గాని హాజరు అయ్యి మీ ఆక్షేపణలు తెలియపరచుకొనవలెను. లేని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడును.

రామచంద్రపురం
04-7-25
డి.జగదీశ్వర్లు
అడ్వకేటు, రామచంద్రపురం